క్లుప్తంగా

చోరీకి విఫలయత్నం

గద్వాల క్రైం: గుర్తు తెలియని దుండగులు చోరీకి యత్నించి విఫలమైన ఘటన గద్వాల మండలం పూడురులో చోటు చేసుకుంది. స్థానికులు, బాధితుడు కథనం మేరకు గ్రామానికి చెందిన పరుశరాం ఇంట్లో బుధవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి చోరీకి యత్నించారు. అయితే ఇంట్లో శబ్దం రావడంతో ఇంటి యాజమాని మేల్కొని నిందితులను పట్టుకునేందుకు యత్నించగా దుండగులు తప్పించుకున్నారు. బాధితుడు రూరల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం

అలంపూర్: ఈదురు గాలులకు అయిజ మండలం ఉప్పల క్యాంపు రోడ్డుపై మంగళవారం రాత్రి చెట్టు విరిగి రోడ్డుపై అడ్డంగా పడింది. దీనిని గమనించకుండా గ్రామానికి చెందిన లబ్బు నగేష్ బైక్‌పై వెళ్తూ చెట్టును ఢీకొని కింద పడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే ఎస్‌ఏ సంపత్ కుమార్ బుధవారం గ్రామానికి చేరుకొని లబ్బు నగేష్‌కు నివాళులర్పించి అంత్యక్రియలో పాల్గొన్నారు. అన్ని విధాలా ఆదుకుంటామని కుటుంబసభ్యులకు భరోసా ఇచ్చారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



అలంపూర్ రూరల్: పట్టణంలోని చౌక్‌బజర్‌లోని 160 కేవీ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్ తరుచుగా మరమ్మతుకు నోచుకుంటోంది. దీంతో అధికారులు దీనిని తొలగించారు. వినియోగదారులను దృష్టిలో ఉంచుకొని హరిజనవాడ పాఠశాల సమీపంలో నూతనంగా ట్రాన్స్‌ఫార్మర్‌ను బుధవారం ఏర్పాటు చేసినట్లు లైన్‌మెన్ రాందాస్ తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది చంద్ పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణ పనులు ప్రారంభం

ధరూరు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మరుగుదొడ్ల నిర్మాణ పనులను బుధవారం స్థానిక పాఠశాల జీహెచ్ఎం ప్రతాప్‌రెడ్డితో కలిసి మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్ఐసీ గ్రామాలయ ఎన్జీఓస్ సహకారంతో మరుగుదొడ్లు నిర్మాణం చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో గద్వాల, కర్నూలు జిల్లాల కో ఆర్డినేటర్స్ ఆంటోని జైపాల్, వేలుమురుగన్, ఉమామహేశ్వరన్, హెల్త్ ఎడ్యుకేటర్ ప్రాణేశ్వర్‌రెడ్డి, వెండర్ ప్రభాకరం, సీఆర్‌పీ నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

పల్లెప్రకృతి వనాలు భేష్



గద్వాల రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనాలు, సెగ్రిగేషన్‌షెడ్లు బాగున్నాయని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ ప్రొఫెసర్ రాజేశ్వర్ అన్నారు. బుధవారం మండలంలోని కొండపల్లిలో వాటిని ఆయన పరిశీలించారు. అడవులను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో డీఆర్డీవో ఏపీడీ నాగేంద్రం, ఎంపీడీఓ చెన్నయ్య పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

ఎర్రవల్లిచౌరస్తా: మండలంలోని మొగిలి రావులచెర్వు గ్రామానికి చెందిన వివాహిత అశ్విని అదృశ్యమైన ఘటన బుధవారం చోటుచేసుకుంది. ఇటిక్యాల ఎస్ఐ గోకారి తెలిపిన వివరాల ప్రకారం కుటుంబ కలహాల కారణంగా వివాహిత మనస్తాపానికి గురై మంగళవారం ఇంటి నుంచి వెళ్లింది. ఎంతకి తిరిగి రాకపోవడంతో చుట్టు పక్కల గ్రామాలతో పాటు బంధువులతో ఆరా తీయగా ఎలాంటి ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కొనసాగుతున్న కంటి పరీక్షలు



గట్టు: మండలంలోని ఆలూరు, తుమ్మలచెరువు, బల్గెర గ్రామాల్లో కంటి వెలుగు శిబిరాలు బుధవారం కొనసాగాయి. మూడు గ్రామాల్లో మొత్తం 408 మందికి కంటి పరీక్షలను నిర్వహించారు. 30 మందికి కంటి అద్దాలను పంపిణీ చేయగా, 35 మందికి కంటి అద్దాల కోసం ప్రతిపాదనలు పంపించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు తిమ్మప్ప, సాయిచరణ్, సమీరాకౌసర్, హెల్త్ సూపర్‌వైజర్లు స్వర్ణలత, బాలమ్మ, ఏఎన్ఎంలు భారతి, ఖేజీయా, రావెల, ఆయా గ్రామాలకు చెందిన ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పక్కా భవనాలు ఏవి?

- గర్భిణులు, బాలింతల అవస్థలు
- పట్టించుకోని అధికారులు



మల్దకల్‌లో అద్దె భవనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం

మల్దకల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు లేక లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారు. మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయి. సమస్యలు ఉన్న అద్దె భవనాలలోనే నెట్టుకురావాల్సిన దుస్థితి నెలకొంది. చిన్నారులకు గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందించే ఈ కేంద్రాలు మౌలిక సదుపాయాల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయాలు లేక లబ్ధిదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలలో మరుగుదొడ్లు ఉన్నా శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు అధికారులకు పలు మార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. పక్కా భవనాలు లేకపోవడంతో ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సొంత భవనాలు నిర్మించి సమస్యను పరిష్కరించాలని అంగన్‌వాడీ టీచర్లు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి సొంత భవనాలు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వివరాలు ఇలా..

మల్దకల్ మండలంలో మొత్తం 59 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో 3 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో 30 కేంద్రాలకు స్వంత భవనాలు ఉండగా మిగతావి గ్రామ పంచాయతీ, సామాజిక కమ్యూనిటీ భవనాలలో కొనసాగుతున్నాయి. మొత్తం 2793 మంది చిన్నారులు, 759 మంది గర్భిణులు, బాలింతలు ఉన్నారు.

పౌష్టికాహార పంపిణీకి ఇబ్బందులు..



గ్రామంలో 6 అంగన్‌వాడీ కేంద్రాలలో 2వ కేంద్రానికి సొంత భవనాలు లేక అద్దె భవనంలో విధులు నిర్వహిస్తున్నారు. గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీకి ఇబ్బందులు పడుతున్నారు. తప్పని పరిస్థితులలో వెళ్లి పౌష్టికాహారం తీసుకుంటున్నాం. సొంత భవనం నిర్మించి సమస్యను పరిష్కరించాలి.

– జయలక్ష్మి, మల్దకల్

అద్దె భవనంలోనే..



అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం లేదు. అద్దె భవనాలలో సరైన వసతులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే గర్భిణు, బాలింతలకు మరుగుదొడ్లు వంటి సదుపాయాలు లేవు. అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదు. ఉన్నతాధికారులు చొరవతీసుకొని సమస్య పరిష్కరించాలి.

– పుష్పలత, అంగన్‌వాడీ టీచర్, మల్దకల్

సమస్యల పరిష్కారానికి కృషి..



అంగన్‌వాడీ కేంద్రాలలో నెలకొన్న సమస్యలను పరిశీలించి ఉన్నతాధికారులకు ప్రతిపాదిస్తాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తాం. సొంత భవనాలు లేని అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు అందజేశాం. మౌలిక వసతుల కల్పనక చర్యలు తీసుకుంటాం.

– కమలాదేవి, సీడీపీఓ

పేదల ఆరోగ్యానికి పెద్దపీట

- ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం



అలంపూర్ చౌరస్తాలో వంద పడకల ఆస్పత్రి పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

అలంపూర్: పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం అన్నారు. బుధవారం అలంపూర్ చౌరస్తాలో నిర్మాణంలో ఉన్న వంద పడకల ఆస్పత్రి భవనాన్ని ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులతో కలిసి సందర్శించారు. ఆపరేషన్ థియేటర్స్, ఓపీ గదులు, వైద్యుల చాంబర్స్, ఐసీయూ, బెడ్స్ గదులను పరిశీలించారు. అనంతరం భవన నిర్మాణ పనులు చేపడుతున్న టీఎస్ఎంఎస్ఐడీసీ డీఈ రాజేష్, ఏఈ రహీముద్దీన్‌లతో సమావేశం నిర్వహించి పనుల పురగతిపై సమీక్షించారు. ఏ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఏ శాఖ నుంచి పనులు జరగాల్సి ఉంది అనే వివరాలు తెలుసుకున్నారు. తాగునీరు, విద్యుత్ వసతిపై ఆయా శాఖల అధికారులతో మాట్లాడారు.

రూ.24 కోట్లతో ఆస్పత్రి నిర్మాణం

రూ. 24 కోట్ల వ్యయంతో వంద పడకల ఆస్పత్రి నిర్మాణం చేపడుతున్నామని ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. నియోజకవర్గంలో ప్రధానంగా వంద పడకల ఆస్పత్రి, తుమ్మిళ్ల ఎత్తిపోతల ద్వార పూర్తి స్థాయిలో సాగునీటిని అందించడానికి మల్లమ్మకుంట, జూలకల్, వల్లూరు రిజర్వాయర్ల నిర్మాణాపై సీఎం దృష్టికి తీసుకెళ్లానన్నారు. రూ. 638 కోట్ల వ్యయంతో తుమ్మిళ్ల మూడు రిజర్వాయర్ల నిర్మాణాల చేపడుతామన్నారు. చిన్నోనిపల్లి రిజర్వాయర్ పనులు పూర్తై ఆర్డీఎస్ 12ఏ డిస్ట్రిబ్యూటరీ లింక్ కలిపితే 27 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజు, వైస్ ఎంపీపీ దేవన్న, సర్పంచ్ రేఖ, నాయకులు వెంకట్ గౌడ్, రమణ, మక్బుల్ బాషా, సుంకన్న తదితరులు ఉన్నారు.

గాంధీ విగ్రహం ధ్వంసం



ధ్వంసమైన గాంధీ విగ్రహం

మల్దకల్: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహాన్ని గుర్తు తెలియని దుండగులు బుధవారం ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న హెచ్ఎం శివన్న పాఠశాలకు చేరుకొని గాంధీ విగ్రహాన్ని పరిశీలించారు. ఈ విషయమై హెచ్ఎం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వెంటనే గద్వాల నుంచి క్లూస్ టీంను రప్పించి ఘటన స్థలానికి చేరుకున్నారు. దుండగులను కఠినంగా శిక్షించాలని గ్రామస్తులు కోరారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శేఖర్ తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక



జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలలో రన్నర్స్‌గా నిలిచిన అలంపూర్ క్రీడాకారులు

అలంపూర్ రూరల్: సీఎం కప్ క్రీడా పోటీలలో భాగంగా బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలలో రన్నర్స్‌గా పట్టణ అంబేడ్కర్ టీం నిలిచింది. ఇందులో ప్రతిభ చూపిన శ్రీహరి, అజయ్‌కుమార్, నాగన్న, చందులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. అదేవిధంగా హ్యాండ్ బాల్ పోటీలో శివచంద్ర, ఆజయ్‌కుమార్, బాలరంగయ్యను ఎంపిక చేసినట్లు పీఈటీ తెలిపారు.

సారా విక్రయిస్తే చర్యలు



సారా పారబోస్తున్న పోలీసులు

కేటీదొడ్డి: సారా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ ఎస్ఐ రాజేందర్ హెచ్చరించారు. మండలంలోని ఉమిత్యాలతండా, వెంకటాపురం చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు బుధవారం రాత్రి దాడులు నిర్వహించి రెండు లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. సారా తయారీ కేంద్రాలను ధ్వంసం చేశారు. సారా తయారీ చేస్తున్న వెంకటేష్ నాయక్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కార్యదర్శులు

అమరచింత: సీఎం కేసీఆర్ చిత్రపటానికి జూనియర్ పంచాయతీ కార్యదర్శులు బుధవారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో ఎంపీడీఓ జ్యోతి సమక్షంలో పాలాభిషేకం చేశారు. సంఘం మండల అధ్యక్షుడు సయ్యద్ రాజిక్ మాట్లాడుతూ తమకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని సీఎం హామీ ఇవ్వడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ నర్సింహులు, ఆశిరెడ్డి పలువురు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ దేశానికే దిక్సూచి..

ఆత్మకూర్: ముఖ్యమంత్రి కేసీఆర్ కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని ఎంపీపీ బంగారుశ్రీనివాసులు, చైర్‌పర్సన్ గాయత్రి, వైస్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, విండో అధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద జూనియర్ పంచాయతీ కార్యదర్శులతో కలిసి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కేసీఆర్ చెప్పిన మాట తప్పరని రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఏదోరకంగా మేలు చేకూరుస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, రవియాదవ్, వీరేశలింగం, మండ్లరామకృష్ణ, మురళీ, విష్ణు, మన్యం, శంకర్, శిరీష, రవిప్రకాష్, మహబూబ్‌ఖాన్, నాగరాజు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల పరిశీలన

మానవపాడు: మండలంలోని జల్లాపురంలో 2007 సంవత్సరంలో పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసింది. సర్వేనెంబర్ రెండులో ఉన్న ప్రభుత్వ భూమిని పేదలకు కేటాయించి పట్టాలను అప్పటి ప్రభుత్వం మంజూరు చేసింది. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం బుధవారం గ్రామంలో ఎంపీడీఓ రమణరావు లబ్ధిదారుల ఇళ్ల పట్టాలను పరిశీలించారు. యజమానుల వివరాలు సేకరించారు. కార్యక్రమంలో ఎంపీఓ ఆంజనేయరెడ్డి, ఆర్ఐ రజానీకాంత్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిధుల మంజూరుపై హర్షం

పెబ్బేరు: మున్సిపాలిటీతో పాటు మండలంలోని పలు గ్రామాల అభివృద్ధి పనులకు రూ. 6.72 కోట్లు నిధులు మంజూరు కావడంతో బుధవారం మున్సిపల్ చెర్‌పర్సన్ కరుణశ్రీ, ఎంపీపీ శైలజ, మున్సిపల్ వైస్ చైర్మన్ కర్రెస్వామి, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ మండలం అభివృద్ధి కోసం మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఎంతో కృషిచేశారని తెలిపారు. పట్టణ కేంద్రంలోని వివిధ అభివృద్ధి పనులకు, కమ్యూనిటీ హాల్స్, మిగిలిన పనులకు రూ.64 లక్షలతో పాటు అదనంగా రూ. 55 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. సెగ్రిగేషన్ షెడ్‌కు రూ.50 లక్షలు, వనపర్తి రోడ్డుకు ఇరువైపులా సుభాష్ చౌరస్తా నుంచి జూరాల ప్రధాన కాల్వ వరకు డ్రైయినేజీ పనులకు రూ. 2.80 కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. అయ్యవారిపల్లి, బున్యాదిపూర్, ఈర్లదిన్నె, గుమ్మడం, జనుంపల్లి, కంచిరావుపల్లి, సూగూర్, పాతపల్లిలో అభివృద్ధి పనులకు రూ. 2.23 కోట్లు నిధులు మంజూరైనట్లు వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పార్వతీగౌడ్, మేకల యల్లయ్య, సాయినాథ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సమాఖ్య భవనంలో సమస్యలు

అమరచింత: మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో సమస్యలు తిష్ట వేసిన అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు తెలిపారు. మండల మహిళా సమాఖ్య భవనాన్ని బుధవారం సీపీఐ బృందం పరిశీలించింది. జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ.. భవనం రంగు వెలిసిపోయిందన్నారు. మరుగుదొడ్లు లేవని, తాగునీటి వసతి లేదని, ఫ్లోరింగ్ దెబ్బతిన్నట్లు తెలిపారు. ప్రభుత్వం జూన్ 2 నుంచి రాష్ట్ర ఆవిర్భావ ఉత్సవాలకు మహిళలు వస్తారని ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మహిళా సమాఖ్య భవనంలో సమస్యలను పరిష్కరించాలని పలుమార్లు మున్సిపల్ కమిషనర్‌తో పాటు ఎంపీడీఓలకు విన్నవించినా ఫలితం లేదన్నారు.

మహిళలు స్వశక్తితో ఆర్థికంగా ఎదగాలి



మాచర్లలో రొట్టెల కేంద్రాన్ని ప్రారంభించిన ఎంపీపీ, జెడ్పీటీసీలు

గట్టు: మహిళలు స్వశక్తితో ఆర్థికంగా ఎదగాలని ఎంపీపీ విజయ్‌కుమార్, జెడ్పీటీసీ బాసు శ్యామల అన్నారు. బుధవారం మాచర్లలో సెర్ప్ ఆధ్వర్యంలో పీఎంఎఫ్ఎంఈ పథకం ద్వారా మంజూరైన రొట్టెల తయారీ కేంద్రం, కారం గిర్ని కేంద్రాలను డీఆర్‌డీఓ పీడీ ఉమాదేవి, సర్పంచ్ సిద్ధిరామప్పలతో కలిసి వారు ప్రారంభించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళలు పొదుపు సంఘాల నిర్వాహణతో పాటుగా ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిని పొంది, ఆర్థికంగా స్థిరపడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ షమీమ్‌బేగం, ఏపీఎం భీమన్న, ఎల్‌డీఎం అయ్యపురెడ్డి, యూబీఐ మేనేజర్ పార్థివన్, సీసీలు శివకుమార్, జయాకర్, పొదుపు సంఘం మహిళలు, మైనార్టీ సెల్ అధ్యక్షుడు అలీ గ్రామస్తులు పాల్గొన్నారు.

వాల్మీకి ఫెడరేషన్ ఏర్పాటు చేయాలి



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గట్టు: వాల్మీకి బోయలకు ప్రత్యేకంగా ఫెడరేషన్‌ను ఏర్పాటు చేసి, నిధులను కేటాయించాలని నడిగడ్డ హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షుడు బలరాం డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆ సమితి ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో అధికారికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ కులవృత్తుల ఆధారంగా ఆయా కులాల సంక్షేమానికి పథకాలను ప్రవేశ పెట్టినట్లు ఆదుకునట్లు ఎలాంటి కులవృత్తి లేని వాల్మీకిబోయలను ఆదుకోవాలని కోరారు. అర్హత కల్గిన ప్రతి ఒక్కరికి రూ.2 లక్షలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెంకట్రాములు, మహాలక్ష్మి, దయాకర్, నరేష్, వీరన్ననాయుడు, రాములు, జమ్మన్న, ఉలిగెప్ప, కొండన్న, రాము, గోవిందు, రాము తదితరులు పాల్గొన్నారు.

పదో రోజుకు చేరిన నిరవధిక దీక్షలు



దీక్షలో మేడికొండ గ్రామస్తులు

అలంపూర్: మేడికొండను నూతన మండలంగా ప్రకటించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. అయిజ మండలంలోని మేడికొండ గ్రామస్తులు తమ గ్రామాన్ని నూతన మండలంగా ప్రకటించాలని చేపట్టిన నిరవధిక దీక్షలు బుధవారం 10వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలానికి కావల్సిన అన్ని సౌకర్యాలు గ్రామంలో ఉన్నాయన్నారు. అన్ని అర్హతలు, వసతులు ఉన్న మేడికొండను వెంటనే మండలం చేయాలని కోరారు. లేనిపక్షంలో భవిష్యత్‌లో పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

'హామీల అమలులో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలం'



కేంద్ర ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న డీకే స్నిగ్ధారెడ్డి

మల్దకల్: హామీల అమలులో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డీకే స్నిగ్ధారెడ్డి అన్నారు. గడప గడపకు బీజేపీ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని నీలిపల్లిలో సర్పంచ్ ప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోడీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను, ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో గడ్డం కృష్ణారెడ్డి, నరేందర్‌రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, జయశ్రీ, కిషోర్, చంటి, భీమన్న, దేవదాస్, చిన్నయేసు, సుధాకర్, బుడ్డన్న, జయరాముడు, నాగరాజు, వెంకటేష్, గోపాల్‌రెడ్డి, లవన్న, దర్శెల్లి పాల్గొన్నారు.

గద్వాల రూరల్: కేంద్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేస్తుందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డీకే స్నిగ్ధారెడ్డి అన్నారు. ఇంటింటికి బీజేపీ కార్యక్రమంలో భాగంగా ఆమె పట్టణంలోని 29వ వార్డులో పర్యటించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు సంబంధించిన కరపత్రాలను ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో గడ్డం కృష్ణారెడ్డి, బండల వెంకట్రాములు, నరేంద్రరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించలేని ప్రభుత్వం



సమ్మెలో మాట్లాడుతున్న విజయరాములు

అమరచింత: ప్రభుత్వం ఐకేపీ, వీఓఏల సమస్యలను పరిష్కరించడంలో ద్వంద్వ వైఖరి ప్రదర్శించడం తగదని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు అన్నారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయం వద్ద బుధవారం ఐకేపీ వీఓఏల నిరవధిక సమ్మెకు మద్దతు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చర్చల పేరిట కాలాన్ని గడిపేస్తుందన్నారు. డిమాండ్స్‌ను నెరవేర్చకుండా కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడుతుందన్నారు. వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కనీస వేతనం నెలకు రూ.26 వేలు అందించాలని డిమాండ్ చేశారు. గ్రామ సంఘం గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా ప్రతి నెల వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాలో వేతనాలు జమ చేయాలని కోరారు. కార్యక్రమంలో అబ్రహం, భాస్కర్, కుతుబ్, ఎర్రన్న, వీఓఏలు పావని, రంగన్న, రాధ పలువురు పాల్గొన్నారు.

కేఎల్ఐ కాల్వలో పేరుకుపోయిన జమ్ము



పాన్‌గల్ సమీపంలోని కేఎల్ఐ కాల్వలో పేరుకపోయిన జమ్ము

పాన్‌గల్: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల గుండా ఉన్నా కేఎల్ఐ కాల్వలో పేరుకపోయిన జమ్మును తొలగించాలని రైతులు కోరుతున్నారు. వర్షాకాలంలో ముందే జమ్ము, పేరుకపోయిన మట్టిని తొలగిస్తే సాగునీరు సాఫీగా ప్రవహించే అవకాశం ఉంటుందని రైతులు తెలుపుతున్నారు. మరమ్మతు చేపట్టకపోతే ముందు గ్రామాల రైతులకు సాగునీరు అందే అవకాశం లేదని ఆందోళన చెందుతున్నారు.

ప్రజలను ఇబ్బందులకు గురిచేయొద్దు



అమరచింత: మరికల్–ఆత్మకూర్ ప్రధాన రహదారిని ఆక్రమించుకుని ఇబ్బందులకు గురిచేసే వారిపై చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్‌ఖాజా తెలిపారు. పట్టణంలోని సవరమ్మ దేవాలయం ఎదురుగా ఉన్న పాత ఇనుప సామాన్ల దుకాణదారుడు ప్రధాన రహదారిపై మూటలు వేసి ఉంచాడు. దీంతో రాకపోకలకు అంతరాయం కలుగుతుండడంతో వాటిని మున్సిపల్ ఆటోలో తీసుకెళ్లారు. వ్యాపారులు తమ దుకాణాల ఎదుట రహదారికి సమీపంలో వస్తువులు అడ్డంగా ఉంచకూడదని సూచించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఖాజా

అమరచింత: పట్టణంలోని మూడో వార్డులో ఎట్టకేలకు సీసీ రోడ్డు పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, కమిషనర్ మహమ్మద్ ఖాజా బుధవారం ప్రారంభించారు. కొన్ని రోజులుగా మూడో వార్డుకు మంజూరైనా సీసీ రోడ్డు వేయడం లేదని, మున్సిపల్ చైర్‌పర్సన్ వివక్ష చూపుతున్నారని కౌన్సిలర్ విజయరాములు ఆందోళన చేపట్టారు. చైర్‌పర్సన్ స్పందిస్తు కాలనీలో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు కాలనీ ప్రజలతో మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్ మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారం కోసం తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.